10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 పేజీలు 8



# బీసీల అభ్యున్నతికి మూడు బిల్లులు ప్రవేశపెట్టాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం మూడు బిల్లులను ప్రవేశపెట్టి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం జనగామ మండలం పెంబర్తిలోని హస్తకళల కేంద్రాన్ని కవిత సందర్శించారు. అంబేడ్కర్, సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..

-2 లో

# ఎంత డిమాండున్నా నిరంతర విద్యుత్ సరఫరా

## వ్యవసాయ బోర్లకు మీటర్ల ప్రసక్తే లేదు ... ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఈ నెల 10న 15,998 మెగావాట్లకు చేరినా ఎక్కడా అంతరాయం లేకుండా నిరంతర సరఫరా చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ లభ్యత 21,398 మెగావాట్ల వరకు ఉన్నందువల్ల నిరంతర సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ లేవని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని భట్టి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, నిరంతర సరఫరా అంశాలపై హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గురువారం రాత్రి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మీడియాకు ఆయన వివరించారు. "ఏటా 8 శాతం చొప్పున పెరిగితే 2030 నాటికి రోజువారీ విద్యుత్ డిమాండ్ సుమారు 24,215 మెగావాట్లకు చేరుతుంది. 2030 నుంచి 2035 వరకు ఏటా 5.6 శాతం చొప్పున డిమాండ్ పెరిగి 31,809 మెగావాట్లకు చేరుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ వచ్చే నిర్మాణాలతో, కొత్తగా రానున్న డేటా కేంద్రాలతో విద్యుత్ డిమాండ్ మరింత పెరుగుతుంది. హిమాచల్‌ప్రదేశ్‌లో కొత్త జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాజస్థాన్‌లో 3,100 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణానికి ఒప్పందం చేసుకోబోతున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత యాదాద్రి

-2 లో

# భాజపాలో వేధింపులు భరించలేకపోతున్నా

## వెళ్లిపో.. అంటే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా: ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** "2014లో పార్టీలో చేరినప్పటి నుంచి వేధింపులు భరిస్తున్నా.. ఇక భరించలేకపోతున్నా. పార్టీకి అవసరం లేదు వెళ్లిపో అని చెబితే ఇప్పటికిప్పుడు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా" అని గోషామహల్ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడారు. గోల్కొండ జిల్లా భాజపా అధ్యక్ష పదవిని ఎస్సీ లేదా బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలని సూచించగా, తాను సూచించిన పేర్లను పక్కనపెట్టి.. ఎంఐఎంతో తిరిగే వారికి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. "పార్టీలోని కీలక నేతకు ఫోన్ చేసి ఇదే అడిగితే ఆ ఎన్నిక విషయం తనకు తెలియదని సమాధానమిచ్చారు. ఆ జవాబుతో నాపై దాగి ఉన్న కుట్ర కోణం బయటపడింది. నేను ఇప్పటి వరకు భారాస, ఎంఐఎం, కాంగ్రెస్‌లతోనే యుద్ధం చేస్తూ వచ్చా. సొంత పార్టీలోనూ యుద్ధం కొనసాగించాల్సిన పరిస్థితి ఎదుర్కోవడం దురదృష్టకరం. జిల్లా అధ్యక్షుడి ఎన్నిక అనేది పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ సూచించిన వ్యక్తికి ఇవ్వడమనేది ప్రతి చోటా జరుగుతుంది. మరి ఇక్కడ నా సూచన ఎందుకు పక్కన పెట్టాల్సి వచ్చిందో సంజాయిషీ ఇవ్వాలి. వెంటనే అధ్యక్షుడిని మార్చాలి" అని డిమాండ్ చేశారు. "నా జీవితంలో ధర్మ ప్రచారం, ధర్మ యుద్ధం నేర్చుకున్నా. ప్రస్తుతం పార్టీలో కొందరు అనుసరిస్తున్నట్లు బ్రోకరిజం నేర్చుకోలేదు. వారి వల్లనే ఈ రోజు పార్టీ వెనుకబడింది. రాష్ట్రంలో ఎప్పుడో భాజపా ప్రభుత్వం రావాలి. కానీ ఇలాంటి రిటైరైన వ్యక్తులు పార్టీలో ఉంటే ఎప్పటికీ భాజపా ప్రభుత్వం రాదు" అని వ్యాఖ్యానించారు.

# ముగిసిన పాతగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** యాదగిరిగుట్ట దేవస్థానానికి అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం (ఫిబ్రవరి 13) ఘనంగా ముగిశాయి. అష్టోత్తర శతఘటాభిషేకము, మహాదాశీర్వచనం, పండిత సన్మానం తో ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు అర్చకులు. ఈ ఉత్సవాలలో ఆలయ

-2 లో





# మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్

## ఇంట్లో విలన్‌గా ఉన్న వ్యక్తి ప్రపంచానికి స్టార్ ఎలా అవుతారని 'సుప్రీం' న్యాయమూర్తి వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** జర్నలిస్ట్‌పై దాడి కేసులో సినీ నటుడు మోహన్‌బాబుకు ఊరట లభించింది. ఆయనకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈమేరకు జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది డిసెంబరు 10న రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలోని తన నివాస ప్రాంగణంలోకి వచ్చిన జర్నలిస్ట్‌పై మోహన్‌బాబు దాడి చేశారని పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా

-2 లో



# బీసీల అభ్యున్నతికి మూడు బిల్లులు ప్రవేశపెట్టాలి

- మొదటి పేజీ తరువాయి

బీసీ బిల్లును కేంద్రానికి పంపించి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని, బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలన్నారు. జాగృతి సంస్థ, భారాస చేపట్టిన ఉద్యమ ఫలితంగానే ప్రభుత్వం బీసీ బిల్లు ప్రవేశపెట్టేందుకు ముందుకొచ్చిందన్నారు. ఈ సందర్భంగా పూసల సామాజిక వర్గం వారు ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలను వివరించారు.

## మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్

- మొదటి పేజీ తరువాయి

నిరాకరించింది. దాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ మోహన్‌బాబుపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని జనవరి 9న ఆదేశించింది. గురువారం జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ముందు ఈ కేసు మరోమారు విచారణకు వచ్చింది. మోహన్‌బాబు తరఫున సీనియర్ న్యాయవాది త్రిదీప్ పేస్ వాదనలు వినిపిస్తూ.. ఇది వాగ్వాదానికి సంబంధించిన కేసు అని, కుమారుడితో ఆయనకు కొన్ని వివాదాలున్నాయని పేర్కొన్నారు. జస్టిస్ అమానుల్లా జోక్యం చేసుకుంటూ.. సీసీ టీవీ దృశ్యాలను తొలగించారని, జర్నలిస్టును బెదిరించారు కదా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సీసీటీవీ ఫుటేజీ ఏమీ లేదని న్యాయవాది బదులిచ్చారు. బాధితుడికి క్షమాపణ చెప్పడానికే పిటిషనర్ ఆసుపత్రికి వెళ్లారని, ఆమేరకు లేఖ కూడా రాశారని, ఆయనపై ఎలాంటి ప్రభావం చూపలేదని తెలిపారు. కుమారుడిపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం తండ్రికి ఏమొచ్చిందని జస్టిస్ అమానుల్లా ప్రశ్నించగా.. కొంతకాలంగా కుటుంబ వివాదం కొనసాగుతోందని న్యాయవాది బదులిచ్చారు. 'ఇంట్లో విలన్‌గా ఉన్న వ్యక్తి ప్రపంచానికి స్టార్ ఎలా అవుతారని' ఈ సందర్భంగా జస్టిస్ అమానుల్లా వ్యాఖ్యానించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**హైకోర్టులో పిటిషన్‌పై విచారణ వాయిదా**

జర్నలిస్ట్‌పై దాడి కేసును కొట్టివేయాలంటూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు అయిన జర్నలిస్ట్ కౌంటరు దాఖలు చేయకపోవడంతో అందుకు వారం రోజుల గడువు ఇస్తూ విచారణను వాయిదా వేశారు.

# ఎంత డిమాండున్నా నిరంతర విద్యుత్ సరఫరా

- మొదటి పేజీ తరువాయి

విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నాం. రాష్ట్రంలో ఓవర్‌లోడ్ ఉన్నచోట 29 సబ్‌స్టేషన్లు నిర్మించాం. డిస్కంలకు రాయితీ కింద గత ఏడాది కాలంలో రూ.18,615 కోట్లు చెల్లించాం. రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని నిర్ణయించాం. ఒడిశాలోని నైనీ ప్రాంతంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి నిర్మిస్తుంది" అని భట్టివిక్రమార్క వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎండీలు కృష్ణభాస్కర్, ముషారఫ్, వరుణ్‌రెడ్డి, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# ముగిసిన పాతగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు..

- మొదటి పేజీ తరువాయి

ఈఓ భాస్కర్ రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 8న ప్రారంభమయ్యాయి. ముందుగా అర్చకులు పవిత్ర జలంతో ఆలయ పరిసరాలను సంప్రోక్షణ చేసి, లక్ష్మీనరసింహులకు రక్షాబంధనం చేశారు. తర్వాత ఆలయ ప్రధానార్చకులు నల్లంతీగళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో స్వస్తివాచనం, రక్షాబంధనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, సాయంత్రం అంకురారోపణం, మృత్సంగ్రహణం నిర్వహించారు. ఆ విధంగా ద

వారం రోజులు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించిన అనంతరం, గురువారం అష్టోత్తర శతఘటాభిషేకము, మహాదాశీర్వచనం, పండిత సన్మానం తో ఉత్సవాలను ముగించారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:** గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆనంద ఖని, కొత్తగూడెం లోని ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ సెంటర్ నందు గ్రామపంచాయతీ ఎన్నికల స్టేజ్ 1 రిటర్నింగ్ అధికారులు ,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారు లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల అధికారులందరూ శిక్షణా కార్యక్రమంలో అన్ని విషయాల పట్ల అవగాహన కల్పించుకొని, ఎటువంటి సందేహాలకు తావు లేకుండా పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి మాట్లాడుతూ, మండల స్థాయిలో పిఓ లకు ఏపీవోలకు త్వరలోనే శిక్షణను అందిస్తామని, మండల స్థాయి అధికారులు అందరూ సంబంధిత శిక్షణను పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పంచాయతీ ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి నగిన సతీష్ కుమార్ మాట్లాడుతూ, కొత్తగూడెం డివిజన్, భద్రాచలం డివిజన్ లో ఉన్న 409 మంది రిటర్నింగ్ మరియు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు గురువారం ఇక్కడ శిక్షణ జరుగుతుందని, డివిజన్ వారీగా ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపులలో సంబంధిత ఆర్వోలు, ఏ ఆర్ ఓ లు జాయిన్ అయి, గ్రూపులో వారికి వచ్చేటువంటి సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ లు సుధీర్ కుమార్, రమణ, విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఎస్.కె. సైదులు, నాగరాజశేఖర్, మాస్టర్ ట్రైనీలు సాయి కృష్ణ, శ్రీనివాసరావు, చలపతి రాజు, దుర్గ శైలజ, స్వరూప్ కుమార్, బి.వి.ఎల్.కుమార్, ఆనంద్ కుమార్ స్వామి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్ళు మండుతున్నాయి...!

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:**సింగరేణి ఉపరితల గనుల బొగ్గుచూర, బి టి పి ఎస్ బూడిద వలన మణుగూరు మండలంలో గాలి విపరీతంగా కాలుష్యమైంది వాతావరణంలో కాలుష్యం విస్తృతంగా ఆవరించింది విపరీతమైన కాలుష్యం వలన వృద్ధులకు పిల్లలకు అనారోగ్యంతో బాధపడుతున్నారు వారికి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగింది తీవ్ర కాలుష్యం కారణంగా కళ్ళు మండుతున్నాయి విపరీతంగా పొగ కారణంగా ప్రజలకు ఊపిరాడటం లేదు. మణుగూరు ఉపరితల గనుల నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్ రోజుకు 16,000 టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నారు. మల్లె పెల్లి ఓసి నుండి బిటి పి ఎస్ రహదారులు వెంబడి నిత్యం 261 బొగ్గు లారీలు విపరీతమైన వేగంతో బిటి పి ఎస్ వారికి లారీలు నడుపుతూ దుమ్ము ధూళితో వెనక వచ్చే వాహనదారులకు కనపడక యాక్సిడెంట్లు అవుతున్నాయి. బొగ్గుచూర దుమ్ము గాలి లో కలుస్తుంది ప్రధాన రహదారి ఇరువైపు ల ఉన్న పచ్చని చెట్లు నల్లగా మారిపోయాయి పచ్చదనం లేక ప్రకృతి విలవిల ఆడుతుంది సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10:00 వరకు విపరీతమైన దుమ్ము బొగ్గుచూర గాలిలో కలుస్తుంది వాతావరణం లో కలవడం వలన సాయంత్రం వేళలో ఆ రహదారిపై ప్రయాణించాలంటే ప్రయాణికులకు ఆయా ప్రాంతాల ప్రజలకు ఊపిరాడకుండా అవుతుంది దట్టంగా గాలిలో ఉన్న కాలుష్యం కారణంగా ఎదుటి గా వచ్చే వాహనం కూడా కనిపించడం లేదు దాంతో

ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రధానంగా గాంధీనగర్ కాళీమాత ఏరియా భగత్ సింగ్ నగర్ శేషగిరి నగర్ రాజుపేట బాపన కుంట తదితర ప్రాంతాలలో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు భద్రాద్రి పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామాలైన చినరావిగూడెం సీతారాంపురం దమ్మక్కపేట సాంబాయిగూడెం గ్రామాలలో విపరీతమైన బూడిద గ్రామాలలో ఆవరిస్తుంది పెరట్లో పెంచుకునే మొక్కల నుండి వాకిళ్ళలో విపరీతమైన బూడిద వర్షం కురుస్తుంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు సింగరేణి ఉపరితల గనులు భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా మణుగూరు మున్సిపాలిటీ,మండలంలోని ప్రజలు తీవ్ర కాలుష్య ప్రభావానికి గురవుతున్నారు ఓబి బొగ్గు బ్లాస్టింగ్ సందర్భంగా సరేనా నిబంధనలు పాటించకపోవడంతో విపరీతమైన దుమ్ము బొగ్గు చూర వాతావరణలో కలుస్తుంది ఓసి టు లో కోల్ క్రషర్ మిషన్ లో వాటర్ ఉపయోగించినీ కారణంగా విపరీతమైన బొగ్గుచూర గాలలో కలుస్తుంది దీని కారణంగా పగిడేరు పంచాయతీలోని శాంతినగర్ గొల్ల కొత్తూరు గ్రామాలు లో గాలి కాలుష్యమై అనారోగ్య పాలవుతున్నారు ఆక్సిజన్ తగ్గి కార్బన్డయాక్సైడ్ అధికం అవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. ఇలానే కొనసాగితే మణుగూరు ఏరియాలో తీవ్ర గాలి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని వెంటనే భద్రాద్రి పవర్ ప్లాంట్ యాజమాన్యం సింగరేణి యాజమాన్యం కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు లేనిచో ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రజలు ప్రజా సంఘాలు పేర్కొన్నారు.

# పెద్ద కథే..!: తాగుబోతు భర్తను కాదని.. లోన్ రికవరీ ఏజెంట్‌ను పెళ్లాడిన మహిళ




**హైదరాబాద్ పెన్ పవర్:**భర్తలో సగభాగం భార్య. జీవితాంతం భర్త కష్టసుఖాల్లో తోడుగా ఉండి బరువు బాధ్యతల్లో భాగం పంచుకునేది భార్య. ఇదంతా ఒకప్పటి ముచ్చట. ఇప్పుడంతా.. అస్సాం. ఒక్క మాటంటే పుట్టింటికి, అంతకుమించి అంటే విడాకుల నోటీసులు. ఇంకాస్త గొడవ పెద్దదైతే.. నీపోరు భరించలేను.. నా జీవితం నేను చూస్కుంటా అనే దాకా వచ్చేశారు. గతంలో ఇలా లేదయ్యో..! భర్త ఎట్లాంటోడైనా భరించేవాళ్లు. తాగొచ్చినా తిండి పెట్టేవారు. ఏనాడైనా ఇద్దరి మధ్య మాటొస్తే, ఆ నాలుగు గోడలకు పరిమితం చేసేవారు. నలుగురికి తెలిసి నవ్వులు పాలవ్వడం ఎందుకనేది అప్పటి సతీమణులు ఆలోచన. ఇప్పుడు అలా లేదయ్యో! ఒకటే సొల్యూషన్.. ఇంటి నుండి జంప్. ఎంత విడ్డూరం కాకపోతే, భర్త తాగుబోతని భార్య లోన్ రికవరీ ఏజెంట్‌తో వెళ్లిపోతుంది చెప్పండి. తాగుబోతు భర్త వేధింపులతో విసిగిపోయిన ఓ మహిళ.. లోన్ రికవరీ ఏజెంట్‌ను పెళ్లాడింది. ఈ ఘటన బీహార్‌లోని జముయ్ జిల్లాలో చోటుచేసుకుంది. జాజల్ గ్రామానికి చెందిన బ్యాంకు ఉద్యోగి పవన్ కుమార్ లోన్ల రికవరీ కోసం ఊరూరూ తిరిగేవాడు. ఈ క్రమంలో అతడికి నాలుగు నెలల కిందట కర్మ టాండ్ గ్రామానికి చెందిన ఇందిరా కుమారి అనే మహిళ పరిచయం అయ్యింది. ఆ సమయంలో ఇద్దరూ ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకోవడంతో.. పరిచయం కాస్తా ప్రేమకు దారితీసింది. ఇంకేముంది..! అప్పటికే తాగుబోతు భర్తతో విసిగిపోయిన ఆమె.. అతనితో పారిపోయి పెళ్లి చేసుకుంది. వీరి వివాహాన్ని చూసేందుకు స్థానికులు ఎగబడటం గమనార్హం. వీరి పెళ్లి వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

**నెటిజన్ల మద్దతు..**

నిజానికి మహిళ నిర్ణయాన్ని నెటిజన్లు సమర్థిస్తున్నారు. అసలే ఈకాలంలో ప్రియుడి కోసం భర్తను లేపేస్తున్న భార్యలు ఎంతో మంది బయటకొస్తున్నారు, మూడుముళ్ల బంధంతో ఒక్కటైన వాడిని మూడో కంటికి తెలియకుండా చాకచక్యంగా లేపేస్తున్నారు. వార్తలో మహిళ అటువంటి సాహసాలు చేయనందుకు సంతోషించాలి అంటున్నారు.. నెటిజన్లు. మనసుకు నచ్చిన వాడితో వెళ్ళిపోయి మంచి పనే చేసిందంటున్నారు.

# భార్య నోటికి ఫెవిక్విక్ వేసిన భర్త.. ఎందుకిలా చేశావని పోలీసులు అడిగితే..



**హైదరాబాద్ పెన్ పవర్:**బెంగళూరు: కర్ణాటకలోని నేలమంగళ పరిధిలోని హరోక్యతనహల్లి అనే గ్రామంలో దారుణమైన ఘటన వెలుగుచూసింది. భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఒక అనుమానపు భర్త తన భార్యను చంపేందుకు యత్నించాడు. తన భార్య నోటికి ఫెవిక్విక్ వేసి ఆ తర్వాత ఆమెను గొంతు నులిమి చంపేందుకు యత్నించాడు. ఈ ఘటనలో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో భయంతో అక్కడ నుంచి పారిపోయాడు. అతని మొబైల్ టవర్ లొకేషన్ ఆధారంగా పోలీసులు బాధితురాలి భర్తను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. మంజుల, సిద్ధలింగస్వామి భార్యాభర్తలు. వీరికి పదేళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. మంజుల తరచుగా ఫోన్ లో మాట్లాడుతూ ఉండేది. ఫోన్ ఎక్కువగా వాడుతూ ఉండేది. దీంతో.. సిద్ధలింగస్వామి తన భార్య మంజులపై అనుమానం పెంచుకున్నాడు. ఆమెకు ఎవరితోనో వివాహేతర సంబంధం ఉందని సూటిపోటి మాటలతో ఆమెను వేధించేవాడు. ఈ క్రమంలోనే. భార్యాభర్తల మధ్య ఈ విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ కారణంగా కోపోద్రేకానికి గురైన సిద్ధలింగస్వామి మంజుల నోటికి ఫెవిక్విక్ వేసి ఆమెను చంపేందుకు యత్నించాడు. అయితే.. అదృష్టవశాత్తూ ఇరుగుపొరుగు వాళ్లు గమనించడంతో సిద్ధలింగస్వామి అక్కడ నుంచి పారిపోయాడు. స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె నోటికి వేసిన ఫెవిక్విక్ ను తొలగించే ప్రయత్నం చేశారు. పోలీసులు సిద్ధలింగస్వామిని అరెస్ట్ చేశారు. ఎందుకిలా చేశావని పోలీసులు అడగ్గా.. ఆమెకు అఫైర్ ఉందనే డౌట్ ఉందని, అందుకే ఫెవిక్విక్ వేసి నోరు మూయించి.. ఆ తర్వాత గొంతు నులిమి చంపాలనుకున్నానని నిందితుడు చెప్పాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ పూర్తి.. బరిలో 19 మంది అభ్యర్థులు




**హైదరాబాద్ పెన్ పవర్:**వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. ఇందులో భాగంగా మొత్తం 22 మందిలో గురువారం (ఫిబ్రవరి 13) ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వరంగల్ -ఖమ్మం -నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లను బుధవారం (ఫిబ్రవరి 13) స్క్రుటినీ అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు, రాష్ట్ర పర్యావరణ, అటవీ,సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ సమక్షంలో నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో నామినేషన్లను పరిశీలించారు.

23 మంది అభ్యర్థులు50 నామినేషన్ సెట్లను దాఖలు చేయగా, ఇండిపెండెంట్ అభ్యర్థి తుండు ఉపేందర్ నామినేషన్ పత్రాలపై సంతకం లేని కారణంగా తిరస్కరించారు. మిగిలిన 22 మంది అభ్యర్థులు సక్రమంగా ఉన్నట్లు బుధవారం ప్రకటించారు.

అయితే ఇవాళ (గురువారం, ఫిబ్రవరి 13) నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేది కావడంతో మొత్తం 22 మందిలో 3 నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

## అమెరికాలో మరో విమాన ప్రమాదం.. కూలిన నేవీ యుద్ధ విమానం




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలలో వరుస విమాన ప్రమాదాలు కలకలం రేపుతున్నా యి. ఇటీవల ఆకాశంలోనే విమానం, హెలికాప్టర్ ఢీకొనడం.. ఎయిర్ పోర్టులో ఆగివున్న జెట్ విమానాన్ని మరో విమానం ఢీకొనడం.దాదాపు వందమంది చనిపోయిన విషయం తెలిసిందే. తాజాగా అమెరికాకు చెందిన జెట్ విమానం సముద్రంలో కూలిపోయింది.. శాన్ ఢి యాగో హార్బర్ సమీపంలో గురువారం తెల్లవారుజామున అమెరికా మిలటరీ విమానం కూలిపోయింది. అయితే పైలట్లు ఇద్దరు సేఫ్ గా బయటపడ్డారు. గురువారం (ఫిబ్రవరి 13) తెల్లవారు జామున షెల్టర్ ఐలాండ్ సమీపంలోని శాన్ డియాగో బేలో %US% నేవీ %EA-18G% గ్రోలర్ విమానం కూలిపోయింది. మిలటరీ యుద్ధ విమానం ఈఏ-18జీ గ్రోలర్ ఎలక్ట్రానిక్ ఫైటర్ జెట్.. నార్ ఐలాండ్ నేవల్ ఎయిర్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న షెల్టర్ ఐలాండ్ వద్ద నీటిలో కుప్పకూలిపోయింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. ఫిషింగ్ ఫిషింగ్ బోటు లో ఉన్న వారు పైలట్లను రక్షించారు. ప్రమాదంపై విచారణ చేపట్టారు.

## పరీక్షల్లో 10 జీపీఏ సాధిస్తే విమానం ఎక్కిస్తా..

### నల్గొండ కలెక్టర్ బంపర్ ఆఫర్

కనగల్ కస్తుర్బా హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ద్యార్థులతో ఇలా త్రిపాఠి ముఖాముఖి

వారితో కలిసి భోజనం చేసి సెల్ఫీ దిగిన కలెక్టర్

నల్గొండ జిల్లాలోని కనగల్ కస్తూర్భా గాంధీ విద్యార్థినులకు కలెక్టర్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. పదో తరగతిలో పదికి పది జీపీఏ సాధిస్తే



**హైదరాబాద్ పెన్ పవర్:**విమానం ఎక్కిస్తానని హామీ ఇచ్చారు. విజయవాడ, చెన్నై లాంటి పట్టణాలకు విమానంలో తీసుకెళతానని చెప్పారు. రాత్రి కనగల్ కస్తూర్భా హాస్టల్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, కిచెన్, హాస్టల్ రూంలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పబ్లిక్ పరీక్షలకు బాగా చదువుకోవాలని సూచించారు. మంచి మార్కులు తెచ్చుకుంటే విమానం ఎక్కిస్తానని చెప్పారు. ఆపై వారితో కలిసి సెల్ఫీ దిగారు. కలెక్టర్ తో పాటు ఎంఈవో వసుమలత, కస్తూర్భా పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.

## అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఏడుగురు అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:**మొయినాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఏడుగురు అరెస్టు చేశారు పోలీసులు. నిందితులు ఈస్ట్ గోదావరి, భద్రాచలం జిల్లాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. దాడి జరిగిన తర్వాత పరారీలో ఉన్న నిందితులలో ఇవాళ (గురువారం 13) ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ( ఫిబ్రవరి 9, 2025 ) రాఘవరెడ్డి 20మంది అనుచరులతో కలిసి రంగరాజన్ ఇంటికి వెళ్లి దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి జరిగిన తర్వాత ప్రధాన నిందితుడు రాఘవరెడ్డితో పాటు మరికొంత మందిని అరెస్టు చేశారు. దీంతో మిగతా నిందితులు అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు పోలీసులు.

రామ రాజ్య స్థాపనకు మద్ధతు ఇవ్వాలని రాఘవరెడ్డి 20 మంది అనుచరులతో అర్చకులు రంగరాజన్ పై దాడి చేశారు. అడ్డొచ్చిన ఆయన కుమారుడిపై కూడా దాడి చేశారు రాఘవరెడ్డి బ్యాచ్. దీనిపై చిలుకూరు బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కీలక నిందితులను అరెస్టు చేశారు. మిగత నిందితుల కోసం గాలిస్తున్నారు.

# మస్తాన్ సాయి కేసులో బిగ్ ట్విస్ట్.. కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:**రాజ్ తరుణ్ – లావణ్య కేసులో కీలక నిందితుడు మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని కోర్టు అనుమతించడంతో గురువారం (ఫిబ్రవరి 13) కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు రాబట్టనున్నారు నార్సింగి పోలీసులు. సైబర్ నేరం, లైంగిక డాడీ, బ్లాక్ మెయిలింగ్ వంటి దురాగతాల కేసులో యూట్యూబర్ మస్తాన్ సాయి పై పలు అభియోగాలు ఉన్నాయి. రాజేంద్రనగర్ కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వడంతో కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు విచారణ చేయనున్నారు. మస్తాన్ సాయి దగ్గర 300 మంది అమ్మాయిల వీడియోలు ఉన్నాయని, అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని లావణ్య ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లావణ్య ఫిర్యాదు మేరకు సోమవారం ( ఫిబ్రవరి 3, 2025 ) మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ కేసులో చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు ఈ కేసులో మరిన్ని కీలక ఆధారాలు, వివరాలు రాబట్టనున్నారు పోలీసులు. పలువురు అమ్మాయిలతో ప్రైవేట్ గా ఉన్న సమయంలో వీడియోలు రికార్డ్ చేసినట్లు మస్తాన్ సాయిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ గా గడిపిన వీడియోలతో మస్తాన్ సాయి బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నట్లు గుర్తించారు పోలీసులు. తనకు చెందిన కొన్ని వీడియోలను మస్తాన్ సాయి రికార్డ్ చేశాడని పేర్కొన్న లావణ్య.. వీడియోలను పోలీసులకు అందజేసింది. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్ లో 300 వీడియోలకు పైగా ఉన్నట్లు గుర్తించారు పోలీసులు.

# అమెరికాలో కోడిగుడ్ల తీవ్ర కొరత.. మూడింతలు పెరిగిన ధర

- గత ఏడాది జనవరిలో 2.52 డాలర్లుగా ఉండగా 7.34 డాలర్లకు పెరిగిన ధర
- చాలా స్టోర్లలో లిమిటెడ్ స్టాక్, నో స్టాక్ బోర్డుల దర్శనం
- బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో గత డిసెంబర్‌లో 2.3 కోట్ల కోళ్లను వధించిన అమెరికా

**హైదరాబాద్ పెన్ పవర్:**మెరికాలో కోడిగుడ్ల కొరత తీవ్రంగా ఉండటంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ధరలు 15 శాతం పెరిగాయని, రానున్న రోజుల్లో మరో 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కోడిగుడ్ల కొరత కారణంగా చాలా స్టోర్లలో 'లిమిటెడ్ స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్ని స్టోర్లలో అయితే, 'నో స్టాక్' బోర్డులు కూడా కనిపిస్తున్నాయి. కొనుగోలుదారులకు ఒక్కొక్కరికి రెండు లేదా మూడు కోడిగుడ్ల ట్రేలను మాత్రమే విక్రయిస్తున్నారు. అమెరికా వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం, బర్డ్ ఫ్లూ వ్యాప్తి కారణంగా గత ఏడాది డిసెంబర్ నెలలో సుమారు 2.3 కోట్ల కోళ్లను వధించారు. గత ఏడాది జనవరిలో ఒక కోడిగుడ్డు ధర 2.52 డాలర్లు ఉండగా, డిసెంబర్ నాటికి అది 4.15 డాలర్లకు పెరిగింది. ప్రస్తుతం ఆ ధర 7.34 డాలర్లకు చేరుకుందని అమెరికా లేబర్ బ్యూరో లెక్కలు చెబుతున్నాయి. ఇదే పరిస్థితి



కొనసాగితే భవిష్యత్తులో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కోడిగుడ్ల ధర 45 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని సమాచారం.

గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. దీంతో వినియోగదారులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే స్టోర్లలో 'నో స్టాక్' లేదా 'లిమిటెడ్ స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయి. కోడిగుడ్ల కొరత, ధరల పెరుగుదల హొటల్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. చాలా రెస్టారెంట్లు గుడ్డుతో చేసే వంటకాలపై 50 శాతం అదనపు ఛార్జీని విధిస్తున్నాయి.

# ప్రేమికులు పార్టీకి వెళుతున్నారా.. ఇలా రెడీ అవ్వండి.. మీ పార్ట్‌నర్‌ను ఇంప్రెస్ చేయండి..!



**హైదరాబాద్ పెన్ పవర్:**వాలెంటైన్ వచ్చేసింది. సాయంత్రం సరదాగా ప్రేమించిన వారితో పార్టీకో, డిన్నర్ కో ప్లాన్ చేసుకునే ఉంటారు చాలా మంది. కానీ ఏం వేసుకోవాలి, ఎలా వెళ్లాలి అనేది పెద్ద ప్రశ్న. అలాంటి వాళ్ల కోసమే ఈ టిప్స్..

సాయంత్రం వేళ పార్టీకి లేదా డిన్నర్ కి వెళ్ళినప్పుడు కాస్త తేలికైన దుస్తులను ఎంచుకోవాలి. అలాగే లేత వర్ణంపై ముదురు గులాబీ రంగుంటే మరీ మంచిది. ఎరుపు రంగు డ్రెస్ చేతులకు కోల్ట్ షోల్డర్ ఉంటే బాగుంటుంది. అలాగే పొడవాటి గౌన్లు కూడా ఈ సందర్భానికి బాగా నప్పుతాయి. ఇవి కూడా ఎరుపు సుదురు ముదురు నీలం రంగులైతే బెటర్. ఎరుపు రంగు డ్రెస్ వేసుకునప్పుడు హెవీ మేకప్ వద్దే వద్దు. డ్రెస్ కలర్ ఫుల్ గా ఉన్నప్పుడు హెవీ మేకప్ అంతగా సెట్ అవ్వదు. అలాగే లిప్‌స్టిక్‌ని కూడా వేసకోకపోతే అందంగా కనబడతారు. మెడలో చిన్న హార్ట్ షేప్ పెండెంట్ వేసుకుంటే హుందాగా ఉంటుంది. మీరు ప్రేమించే వారు కూడా స్పెషల్ గా ఫీల్ అవుతారు. హ్యాండ్ బ్యాగ్, పెండెంట్, చెప్పులు ఏదో ఒకటి హార్డ్ షేప్ లో ఉండేలా చూసుకోవాలి. అప్పుడు డ్రెస్ ఎలా ఉన్నా బాగానే ఉంటుంది. చీరకట్టులో మెరవాలంటే ఎరుపుని మించిన రంగు మరొకటి లేదు. చీర అంచున చిన్న ఎంబ్రాయిడరీ వర్క్ ఉంటే బాగుంటుంది. హై హీల్స్ కూడా ఈ సందర్భానికి బాగా నప్పుతాయి.

# కండెక్టర్‌పై కోపంతో.. ఏకంగా బస్సునే హైజాక్ చేసిన తాగుబోతు



**హైదరాబాద్ పెన్ పవర్:**కండక్టర్ పై రివెంజ్ తీర్చుకోవడం కోసం ఏకంగా బస్సును దొంగిలించాడు..ఆ బస్సుతో నానా రచ్చ చేశాడు. కండక్టర్ మీద కోపంతో బస్సును దొంగిలించి తీసుకుపోతూ యాక్సిడెంట్లూ చేశాడు. విషయం తెలుసుకన్న ఆర్టీసీ సిబ్బంది వెంబడించి చివరికి అతని పట్టుకోవడం పెద్ద ప్రమాదం తప్పింది. తమిళ నాడులోని చెన్నైలో %మీజ% ఆర్టీసీ బస్సును హైజాక్ చేసి లారీ ఢీకొట్టిన వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెసెంట్ నగర్ నివాసి అబ్రహం స్థానికంగా ఉన్న గుడువాంచెరిలో కార్ ఇంటీరియర్ డెకరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఓరోజు బస్సులో వెళు ్తండగా కండక్టర్ తో గొడవ జరిగింది.. దీంతో కండక్టర్ అతన్ని కిందికి దించేశాడు..దీంతో కండక్టర్ పై కోపం పెంచుకున్న అబ్రహం రివెంజ్ తీర్చుకోవాలనుకున్నాడు.. గురువారం (ఫిబ్రవరి 13) తెల్లవారు జామున తిరువాన్మియూర్ బస్ టెర్మినల్ నుంచి బస్సును అబ్రహం అపహరించారు. తాగిన మైకంలో ఉన్న అబ్రహాం బస్సును అడ్డగోలుగా నడిపుతూ లారీతోపాటు రెండు వాహనాలను ఢీకొట్టాడు. దీంతో స్థానికులు, వాహనాదారులను భయాందోళనకు గురిచేశాడు. హైజాక్ సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అబ్రహం మద్యం మత్తులో ఉన్నాడని, లారీని ఢీకొన్న విషయం లారీ డ్రైవర్ పోలీసులకు

సమాచారం అందించడంతో పోలీసు బృందం బస్సును కొద్ది దూరం వెంబడించి చివరకు అతికష్టం మీద అతన్ని పట్టుకోగలిగారు.


పోలీసులు తమదైన శైలిలో అబ్రహాంను విచారించడంతో అసలు చెప్పేశాడు. కండక్టర్ పై ప్రతీకారం తీర్చుకునేందుకే బస్సును హైజాక్ చేశానని చెప్పాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అబ్రహాం ను అరెస్ట్ చేశారు.

# రూ.5 కోట్ల చోరీ.. నారాయణ గూడ నుంచి నాగ్‌పూర్‌లో తేలారు.. ఎలా దొరికారంటే..




**హైదరాబాద్ పెన్ పవర్:**యజమాని కుటుంబంతో కుమార్తె వివాహం కోసం దుబాయ్ వెళ్లారు. ఇల్లు జాగ్రత్తగా చూసుకోవాల్సిన పనివాళు ్లు.. అదే అదునుగా ఇల్లును గుల్ల చేశారు. 5 కోట్ల రూపాయల విలువైన బంగారం, వజ్రాలు, నగదు, ఫారెన్ కరెన్సీ ని చోరీ చేసి హైదరాబాద్ నగరాన్ని దాటారు. హైదరాబాద్ నారాయణ గూడలో సంచలనం సృష్టించిన కేసును ఈస్ట్ జోన్, సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా వేగంగా ఛేదించారు పోలీసులు. ఈ కేసుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. రోహిత్ కేడియా అనే వ్యాపారి కుమార్తె పెళ్లి కోసం దుబాయ్ కి వెళ్లారు.. ఈ క్రమంలో ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం మొల్వా ముఖియా, సుషీల్, బాసంతి ఆరిలు చోరికి పాల్పడ్డారు. పనివాళ్లను నమ్మి ఇల్లును చూసుకోమని చెప్పి పెళ్లికి వెళ్లిన సమయంలో చోరికి పాల్పడ్డారు. చోరీ జరిగిన తర్వాత కేసు నమోదైన వెంటనే 3 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి దర్యాప్తు చేసినట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. నిందితులు చోరీ చేసి తెలంగాణ ఎక్స్ ప్రెస్ లో ప్రయాణిస్తుండగా నాగ్ పూర్ లో పట్టుబడ్డారు. నాగ్ పూర్ రైల్వే పోలీసుల సహకారంతో హైదరాబాద్ ఈస్ట్ జోన్ పోలీసులు రైలులో తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు.నిందితుల్లో మొల్వా ముఖియా గతంలో దోమలగూడ పరిధిలో వృద్ధురాలి పై దాడి చేసి కోటి రూపాయలు దొంగిలించిన కేసులోను ప్రధాన నిందితుడు. ఈ చోరీ కేసు ను 24 గంటల్లో ఛేదించిన ఈస్ట్ జోన్, టాస్క్ ఫోర్స్ పోలీసులను అభినందిస్తున్నామని సీపీ ఆనంద్ తెలిపారు.

# బంగారం ధర మళ్లీ పెరిగింది.. త్వరలోనే లక్ష మార్క్ దాటేలా ఉంది



**హైదరాబాద్ పెన్ పవర్:**గత కొద్ది రోజులుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. నిన్న కాస్త ఊరట నిచ్చిన ధరలు గురువారం (ఫిబ్రవరి 13)న మళ్లీ పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల తులం బంగారం ధర రూ.380 లు పెరిగి 87వేల 050లకు చేరింది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.400లు పెరిగి 79వేల 800 లకు చేరింది. హైదరాబాద్ లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 87వేల 050లు, 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 79వేల 800లుగా ఉంది. మరో వైపు హైదరాబాద్ లో వెండికి కూడా డిమాండ్ పెరిగింది. కొనుగోలు ఎక్కువగా ఉండటంతో కిలో వెండి ధర రూ. లక్షా 07వేలుగా ఉంది. బంగారం ధరలు ప్రపంచ మార్కెట్లో బంగారం ధరలపై ఆధారపడి ఉంటాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ,కేంద్రం విధించే దిగుమతి సుంకాలు, ద్రవ్యోల్బణం, ప్రపంచ ధరలలో మార్పు, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, వడ్డీ రేట్లలో హెచ్చుతగ్గులు, ఆభరణాల మార్కెట్లు వంటి అనేక అంతర్జాతీయ అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి.

## ఆసియాలో సంపన్న కుటుంబాల జాబితా.. అగ్రస్థానం సహా టాప్-10లో 4 భారతీయ ఫ్యామిలీలు!



హైదరాబాద్ పెన్ పవర్:ఆసియాలోనే అత్యంత సంపన్న కుటుంబాల జాబితాను తాజాగా బ్లూమ్‌బర్గ్ రిలీజ్ చేసింది. ఈ జాబితాలో మన భారతీయ కుటుంబం అగ్రస్థానంలో నిలిచింది. అలాగే జాబితాలో టాప్-10లో నాలుగు భారతీయ ఫ్యామిలీలు చోటు దక్కించుకోవడం విశేషం.

కాగా, ఆసియాలో అత్యంత ధనిక ఫ్యామిలీగా రూ. 7.86లక్షల కోట్ల సంపదతో ముకేశ్ అంబానీ కుటుంబం అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే రెండో స్థానంలో థాయ్‌లాండ్‌కు చెందిన చీరావనోంట్ కుటుంబం (రూ. 3.70లక్షల కోట్లు) నిలిచింది.

ఇక మూడో స్థానంలో ఇండోనేషియాకు చెందిన హర్టోనో ఫ్యామిలీ (రూ. 3.66 లక్షల కోట్లు) ఉంటే... నాలుగో స్థానాన్ని రూ. 3.25 లక్షల కోట్ల సంపదతో మిస్త్రీ కుటుంబం దక్కించుకుంది. అలాగే ఏడు, తొమ్మిదో స్థానాల్లో వరుసగా జిందాల్ (రూ. 2.44లక్షల కోట్లు), బిర్లా (రూ. 1.99లక్షల కోట్లు) ఫ్యామిలీలు నిలిచాయి.

## ఇట్స్ అఫిషియల్: కొత్త 50 రూపాయలు నోట్లు వస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి..!




హైదరాబాద్ పెన్ పవర్:భారత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరలో కొత్త రూ.50 నోట్లను విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటన చేసింది. కొత్త రూ.50 నోట్లపై ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకం ఉండనుంది."గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.50 డినామినేషన్ నోట్లను త్వరలో విడుదల చేయనున్నాం.. ఈ నోట్ల డిజైన్ అన్ని విధాలుగా మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లోని రూ. 50 నోట్లను పోలి ఉంటుంది.." అని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

**పాత నోట్లు చెల్లుతాయ్.. అపోహలు వద్దు**

కొత్త నోట్లు వస్తున్నాయంటే.. పాత నోట్లు రద్దవుతాయన్న ప్రచారాలు వస్తుంటాయి. అటువంటి పుకార్లు నమ్మకండి. గతంలో రిజర్వ్ బ్యాంక్ జారీ చేసిన రూ. 50 విలువ కలిగిన అన్ని నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో ఉంటాయి. ప్రస్తుతం చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లలో ఎక్కువ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ సంతకంతోనే ప్రచారంలో ఉన్నాయి.మరో ఇంపోర్టెంట్ విషయం, కొత్త రూ.50 నోట్లు వస్తున్నాయంటే.. నకిలీ నోట్లు చలామణి అయ్యే అవకాశం లేకపోలేదు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండండి.

# కారులో వర్క్ చేస్తున్న మహిళకు ట్రాఫిక్ పోలీస్ ఫైన్



హైదరాబాద్ పెన్ పవర్:ఇంట్లో పని చేసుకోండి లేదంటే ఆఫీసులో వర్క్ చేసుకోండి.. అంతేకానీ రోడ్డెక్కి.. కారు డ్రైవింగ్ చేసుకుంటూ.. డ్రైవింగ్ సీట్లో కూర్చుని.. ల్యాప్ ట్యాప్ తో వర్క్ చేయటం ఏంటి..ఫోన్ మాట్లాడటమే నేరం అయితే.. అలాంటిది ఏకంగా రోడ్డుపై డ్రైవింగ్ చేస్తూ.. స్టీరింగ్ వదిలేసి ల్యాప్ ట్యాప్ లో వర్క్ చేస్తున్న మహిళకు.. ఫైన్ వేశా రు ట్రాఫిక్ పోలీసులు. బెంగళూరు సిటీలోని ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావటంతో.. ఏకంగా ఆ రాష్ట్ర డీజీపీ స్పందించారు. ఆ మహిళ ఇంటికి వెళ్లి మరీ ట్రాఫిక్ చలానా ఇచ్చారు పోలీసులు. దీనిపై సోషల్ మీడియాలో ఇప్పుడు భిన్న వాదనలు వ్యక్తం చేస్తున్నారు నెటిజన్లు.

బెంగళూరులో ఓ మహిళ కారు నడుపుతూ ల్యాప్‌టాప్ ఉపయోగించినందుకు ట్రాఫిక్ పోలీసులు ఆమెకు జరిమానా విధించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.మహిళ కారు నడుపుతూ డ్రైవింగ్ చేస్తుండగా వీడియో తీసి బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు ఇంటర్నెట్ లో షేర్ చేశారు. ఇలా డ్రైవింగ్ చేయడ కూడా చట్ట ప్రకారం నేరమే.. ప్రమాదాలకు కారణం అవుతుంది.. ఇలాంటి పనులు మరెవ్వరూ చేయకండి అంటూ హెచ్చరిస్తున్నట్లుగా ట్రాఫిక్ పోలీసులు ఈ వీడియోను పోస్ట్ చేశారు. నెటిజన్లు షేర్ చేస్తుండటంతో వైరల్ అయింది. సోషల్ మీడియాలో ట్రాఫిక్ పోలీసుల పోస్ట్‌పై నెటిజన్లు భిన్న వాదనలు చేస్తున్నారు. కొందరు ఆ మహిళ డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయాలని అంటే.. మరికొందరు పాపం వర్క్ లోడ్ ఎక్కువగా ఉందేమో అని సానుభూతి చూపారు. "ఇంకో నెటిజన్ స్పందిస్తూ.. ఆమె లైసెన్స్ రద్దు చేయాలి" పోస్ట్ చేశారు. "ఎవరిది తప్పు? ఉద్యోగిదా లేదా యజమానిదా ?" అని మరొకరు ప్రశ్నించారు. ఇలా రకరకాల అభిప్రాయాలతో పోస్టులు చేయడంతో మహిళా ల్యాప్ టాప్ వర్క్ అండ్ డ్రైవింగ్ చర్చనీయాంశమైంది.

# తరచూ తలనొప్పి వస్తోందా... ఈ ఆరు సమస్యలు కావొచ్చు!



హైదరాబాద్ పెన్ పవర్:ఇటీవలి కాలంలో తరచూ తలనొప్పితో బాధపడేవారి సంఖ్య పెరిగిపోయింది. రణగొణ ధ్వనులు ఓవైపు, తీవ్ర ఒత్తిడి, మానసిక ఆందోళన వంటివి మరోవైపు తలనొప్పికి కారణమయ్యే అవకాశాలు ఉన్నాయి. కానీ మన శరీరంలో ఏర్పడే కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు కూడా తలనొప్పి రూపంలో బయటపడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని జాగ్రత్తగా గమనించి, తగిన చర్యలు తీసుకుంటే... మంచిదని సూచిస్తున్నారు.

**రక్తపోటు (బ్లడ్ ప్రెషర్)**

యుక్త వయసు దాటిన వారిలో తరచూ తలనొప్పి వస్తోందంటే... వారిలో రక్తపోటు స్థాయి సరిగా లేదని అర్థమని నిపుణులు చెబుతున్నారు. బ్లడ్ ప్రెషర్ తక్కువగాగానీ, ఎక్కువగా గానీ ఉండటం, ఉన్నట్టుండి పెరుగుతూ, తగ్గుతూ ఉండటం వల్ల తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు.

**తీవ్ర ఒత్తిడి (స్ట్రెస్)**

ప్రస్తుతం ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడి మధ్య జీవిస్తున్నారు. అయితే ఇలా ఒత్తిడి ఎక్కువకాలం కొనసాగితే... వారు తరచూ తలనొప్పి బారిన పడతారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**ఆహారం జీర్ణ కాకపోవడం...**

సరిగా నిద్రలేకపోవడం, వేళకు తినకపోవడం, మసాలాలు, కారం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం వంటివాటికితోడు పలు ఇతర సమస్యల కారణంగా జీర్ణ వ్యవస్థ పనితీరు దెబ్బతింటుంది. తిన్న ఆహారం సరిగా జీర్ణంకాదు. ఇలాంటి వారిలో తలనొప్పి సమస్య వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నవారు తీవ్ర స్థాయిలో తలనొప్పితో బాధపడే అవకాశం ఎక్కువని వివరిస్తున్నారు.

**కంటి సమస్యలు..**

ఎవరిలోనైనా కంటి చూపు సమస్య మొదలైందంటే... అది తలనొప్పి రూపంలో మొదట బయటపడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ తరహా తలనొప్పి మరీ తీవ్రంగా ఉండదని... కానీ ఎక్కువ సేపు ఉండటం, తరచూ సమస్య తలెత్తడం జరుగుతుందని వివరిస్తున్నారు. తరచూ స్వల్పస్థాయి తలనొప్పి వేధిస్తుంటే... కంటి పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

**మైగ్రేన్...**

మెదడులోని రసాయనాల స్థితిలో తేడాలు రావడం వల్ల తీవ్ర స్థాయి తలనొప్పి వస్తుంది. దీనిని మైగ్రేన్ గా పిలుస్తారు. ఈ తరహా తలనొప్పిలో ఎక్కువ వెలుతురును, శబ్దాన్ని భరించలేకపోతారని నిపుణులు చెబుతున్నారు. కొన్ని రకాల ఆహార పదార్థాల వల్ల కూడా మైగ్రేన్ తలెత్తే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు.

**బ్రెయిన్ ట్యూమర్...**

ఎవరైనా తరచూ, తీవ్ర స్థాయిలో తలనొప్పితో బాధపడుతూ కారణం ఏమిటో గుర్తించలేకపోతే... అది బ్రెయిన్ ట్యూమర్ సమస్య కావొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. మెదడులో కణతులు ఏర్పడితే... తలనొప్పి సమస్య తరచూ వేధిస్తుందని, తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

**మరెన్నో కారణాలు... తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు...**

ఒక్కసారిగా మొదలయ్యే తలనొప్పి... కొన్నిసార్లు గుండెపోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ముందటి లక్షణం కావొచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది అరుదు అని పేర్కొంటున్నారు. మెదడులో ద్రవాలు పేరుకుపోవడం వంటివి కూడా తలనొప్పికి దారితీయవచ్చని చెబుతున్నారు. అందువల్ల తరచూ తలనొప్పి వేధిస్తుంటే... ముందుగా వైద్యులను కలిసి తగిన పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# సికింద్రాబాద్‌లో అమ్ముతుంది కుళ్లిన చికెనా..? రెండు చికెన్ సెంటర్స్‌లో 5 క్వింటాళ్లు సీజ్



**హైదరాబాద్ పెన్ పవర్:**అసలే బర్డ్ ఫ్లూ భయంతో జనం బెంబేలెత్తిపోతుంటే కొందరు చికెన్ సెంటర్ యజమానులు కాసుల కక్కుర్తితో కుళ్లిన చికెన్ అమ్ముతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి ఈ గలీజు దందాకు తెరతీశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని అన్నా నగర్ చికెన్ సెంటర్స్ లో నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, కంటోన్మెంట్ బోర్డు హెల్త్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. రెండు షాపుల్లో తనిఖీలు చేయగా సుమారు ఐదు క్వింటాళ్ల కుళ్ళిన చికెన్ కనిపించింది. అధికారులు ఈ కుళ్లిన చికెన్‌ను సీజ్ చేశారు.కెమికల్స్, మసాలాలు కలిపి నిల్వ ఉంచిన కుళ్ళిన చికెన్ కనిపించడంతో అధికారులు అవాక్కయ్యారు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్థానిక నాయకులు పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఎన్ని సార్లు దాడులు చేసి సీజ్ చేసి కేసులు పెట్టినా ప్లేసులు మారుస్తూ కుళ్ళిన చికెన్ అమ్ముతూ ప్రజల ప్రాణాలతో కొందరు వ్యాపారులు చెలగాటం ఆడుతున్నారు. కుళ్ళిన చికెన్‌ను తక్కువ ధరకు వైన్స్ పర్మిట్ షాపులకు, కల్లు దుకాణాలకు, బార్లకు సప్లయ్ చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో తేలింది.2024, అక్టోబర్ లో కూడా బేగంపేట ప్రకాష్ నగర్ లో ఈ కుళ్లిన చికెన్ దందా బయటపడింది. 7 క్వింటాళ్ల కుళ్లిన చికెన్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జీహెచ్ఎంసీకి చెందిన ఆహార భద్రతా విభాగం అధికారులు ప్రకాశ్ నగర్‌లోని బాలయ్య చికెన్ సెంటర్‌లో తనిఖీలు చేయగా ఈ నిజం వెలుగులోకి వచ్చింది. ఈ సోదాల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. బేగంపేటప్రకాశ్ నగర్‌కు చెందిన బాలయ్య (36) 2024, అక్టోబర్ నాటికి.. పది నెలల క్రితం అదే ప్రాంతంలో బాలయ్య చికెన్‌సెంటర్‌పేరుతో షాపు ఓపెన్ చేశాడు.కోడి కాళ్లు, తల, ఇతర భాగాలను సేకరించి తన షాపులోని ఫ్రిజ్‌లో భద్రపరుస్తున్నాడు. అలా దాచిన చికెన్‌ను సిటీలోని బార్లు, కల్లు దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు అమ్ముతున్నాడు. నెల రోజుల క్రితం సేకరించి దాచిపెట్టిన చికెన్, ఎముకలు, తల, ఇతర భాగాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదంతా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఆ మాంసానికి కెమికల్స్‌వేసి వివిధ దుకాణాలకు అమ్ముతున్నాడని అధికారులు గుర్తించారు.

# రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై చెప్పు విసిరిన ముద్దాయి



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. జీవిత ఖైదు పడిన ఓ నేరస్తుడు కోపం తట్టుకోలేక జడ్జి పట్ల దురుసుగా ప్రవర్తించాడు. పోక్సో కోర్టు న్యాయమూర్తిపై చెప్పు విసిరాడు. పోక్సో కేసులో తనను జడ్జి దోషిగా ప్రకటించడంతో జీర్ణించుకోలేకపోయాడు. జడ్జిపై చెప్పు విసిరాడు. జరిగిన ఘటనతో అక్కడున్న వారంతా షాక్ కు గురయ్యారు. కోర్టులో ఉన్న న్యాయవాదులు నేరస్తుడిని పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# మనుషులు ఉండాలా..? పోవాలా..? చేపలకు మేతగా బర్డ్ ఫ్లూ కోళ్లు..!



**హైదరాబాద్ పెన్ పవర్:**తూర్పు గోదావరి జిల్లాలో కలకలం రేగింది. చేపల చెరువులకు మేతగా బర్డ్‌ఫ్లూ కోళ్లను వేస్తున్నట్లు తెలిసింది. చనిపోయిన కోళ్లను యజమానులు చేపల చెరువుల్లో పడేస్తున్నారు. జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు,పెద్దాపురంలో చేపలకు మేతగా కోళ్లను వేస్తున్నట్టు గుర్తించారు. కాకినాడ ఎన్జీవో సభ్యులు వీడియోలు విడుదల చేశారు. ఏపీలో పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు మండలం వేల్పూరు, తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదయ్యాయి. అక్కడి కోళ్ల నుంచి తీసుకున్న శాంపిల్స్‌లో ఏవీఎన్ ఇన్ ఫ్లుయెంజా(హెచ్5ఎన్1-బర్డ్ ఫ్లూ) ఉందని నిర్ధారించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దులు ఆనుకొని ఉండడంతో తెలంగాణ అధికార యంత్రాంగం కూడా అలర్ట్ అయింది.సూర్యాపేట జిల్లాలో కోదాడ రామాపురం దగ్గర, నల్గొండ జిల్లాలో తిరుమలగిరి సాగర్, వాడపల్లి వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఏపీలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కావడంతో సరిహద్దు జిల్లాల్లో టెన్షన్ నెలకొంది. ప్రభుత్వ ఆదేశాలతో ఏపీని ఆనుకొని ఉన్న ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల అధికారులు అప్రమత్తమయ్యారు. సరిహద్దుల్లో 24 చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ పశు సంవర్ధక శాఖ సిబ్బందిని నియమించారు. వాహనాలను తనిఖీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. ప్రత్యేకించి కోళ్లు, కోడి గుడ్లు, కోళ్ల దాణా ఏపీ నుంచి మన రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. కోళ్లు, గుడ్లు, దాణాతో ఏవైనా వాహనాలు వస్తే వాటిని తిప్పి పంపిస్తున్నారు.హైదరాబాద్‌లో ప్రతిరోజు ఒక్కో షాపులో కనీసం 300 నుంచి 500 కిలోల చికెన్ అమ్ముతుంటారు. కానీ, రెండు రోజులుగా కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతోందనే ప్రచారంతో అమ్మకాలు తగ్గాయి. వారం కింద కిలో చికెన్ (విత్ స్కిన్) రూ. 200, స్కిన్‌లెస్ చికెన్‌రూ.220 వరకు ఉండగా బుధవారం కొన్ని చోట్ల విత్ స్కిన్ చికెన్ రూ. 180కి, స్కిన్ లెస్ చికెన్ రూ. 200కి కిలో చొప్పున అమ్మడం కనిపించింది. అమ్మకాలు ఇంకా పడిపోతే, ధరలు కూడా తగ్గించే అవకాశం ఉంది.

# మార్చి 31 పండగ రోజైనా.. బ్యాంకులు పనిచేస్తాయి.. ఎందుకంటే..




**హైదరాబాద్ పెన్ పవర్:**ఫైనాన్షియల్ ఇయర్ పూర్తవుతున్న సందర్భంగా ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. 2025, మార్చి 31 రోజు పండగ హాలిడే ఉన్నప్పటికీ బ్యాంకుల సెలవును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అంటే ఆ రోజు బ్యాంకులు యాదావిధిగా పనిచేస్తాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా వివిధ ట్రాన్సాక్షన్స్ పూర్తి చేయాల్సి ఉన్న కారణంగా ఆ రోజు హాలిడేను క్యాన్సిల్ చేస్తూ నిర్ణయం తీసుకుంది ఆర్బీఐ.

మార్చి 31 తేదీన రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా ప్రభుత్వ హాలిడే ఉంటుంది. అయితే ఆర్బీఐ నిర్ణయంతో ఆ రోజు బ్యాంకులకు సెలవు లేనట్లే. హిమచల్ ప్రదేశ్, మిజోరం రాష్ట్రాలలో తప్ప మిగతా అన్ని రాష్ట్రాలలో రంజాన్ రోజున బ్యాంకులకు హాలిడే ఉంటుంది. కానీ ఈ సారి ప్రత్యేక పరిస్థితుల్లో బ్యాంకులు పనిచేయనున్నాయి.

మార్చి 31న ఫైనాన్షియల్ ఇయర్ కు సంబంధించిన అన్ని ట్రాన్సాక్షన్స్, రిసీప్ట్స్, పేమెంట్స్ మొదలైన అన్ని ఆరోజు క్లియర్ చేయాల్సి ఉంటుంది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందు ఆ యేడాదికి సంబంధించిన అన్ని లావాదేవీలను పూర్తి చేయడం ప్రతి ఏటా పరిపాటే.

2025, మార్చి 31న బ్యాంకులలో ఈ కింది సేవలు అందుబాటులో ఉంటాయి:
ప్రభుత్వ పన్నుల చెల్లింపులు (ఇన్ కమ్ ట్యాక్స్, జీఎస్టీ, పన్నులు, ఎక్సైజ్ డ్యూటీ)
పెన్షన్ చెల్లింపులు, ప్రభుత్వ సబ్సిడీలు
ప్రభుత్వం ఇచ్చే జీతాలు, అలొవెన్సెస్
ప్రభుత్వ పథకాలకు సంబంధించి లావాదేవీలు

**ఏప్రిల్ 1న హాలీడే:**

గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లావాదేవీలు పూర్తి చేసిన సందర్భంగా ఏప్రిల్ 1న బ్యాంకులకు సెలవు ఉంటుంది. మేఘాలయ, ఛత్తీస్ గఢ్, మిజోరం, వెస్ట్ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, మేఘాలయలో ఉండదు.

అదేవిధంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలైన ఆన్ లైన్, మొబైల్ బ్యాంకింగ్ ప్రుభుత్వ అంటే ట్యాక్స్ చెల్లింపులు, నగదు బదిలీ మొదలైనవి అందుబాటులో ఉంటాయి.

# ప్రాథమిక హక్కుల రక్షణపై సుప్రీంకోర్టు తీర్పులు ఇవే.. హెబియస్ కార్పస్ అంటే ఏంటీ..?

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత పౌరుల హక్కులకు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు భవిష్యత్తులో ఏ రకమైన ఆటంకాలు గానీ భంగం కలగకుండా ఉండటం కోసం భారత రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగం ప్రసాదించే ప్రాథమిక హక్కుల సంరక్షణ బాధ్యతను సుప్రీంకోర్టు, హైకోర్టులకు అప్పగించారు. ఈ హక్కును భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం వంటిదిగా బి.ఆర్.అంబేద్కర్ వర్ణించారు. రాజ్యాంగం ప్రసాదించే ప్రాథమిక హక్కులకు పూచీకత్తు వంటిదిగా ఈ హక్కును పేర్కొంటారు. ప్రభుత్వాల అధికార దుర్వినియోగం, నియంతృత్వ విధానాల నుంచి పౌరులు ఈ హక్కు ద్వారా పరిహారాన్ని పొందవచ్చు.



**ఆర్టికల్ 32(1):** పౌరులు ఎవరైనా తమ హక్కులకు భంగం కలిగినప్పుడు వాటి సంరక్షణ కోసం అలాగే ప్రాథమిక హక్కుల అమలు కోసం ఉన్నత న్యాయస్థానాలైన సుప్రీంకోర్టు, హైకోర్టును సంప్రదించవచ్చు.

**ఆర్టికల్ 32(2):** పౌరుల ప్రాథమిక హక్కుల సంరక్షణ కోసం అలాగే హక్కుల అమలు కోసం ఉన్నత న్యాయస్థానాలైన సుప్రీంకోర్టు, హైకోర్టులు రిట్లు జారీ చేస్తాయి. ఉన్నత న్యాయస్థానాలు ప్రభుత్వాలకు గానీ ప్రభుత్వ అధికారులకు గానీ అలాగే అధికార సంస్థలకు గానీ రిట్లను జారీ చేస్తాయి.

**ఆర్టికల్ 32(3):** సుప్రీంకోర్టు, హైకోర్టుల రిట్లు జారీ చేసే అధికారంపై పరిమితులు విధించరాదు.

రిట్లు జారీ చేసే అధికారం సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే ఉన్నది.

రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ దేశం నుంచి గ్రహించారు.

జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో రాష్ట్రపతి ఈ హక్కు అమలును సస్పెండ్ చేయవచ్చు.

రాజ్యాంగ పరిహార హక్కు ద్వారా ప్రభుత్వం చర్యలను న్యాయసమీక్షకు గురిచేయడానికి అవకాశం ఉంటుంది. ప్రాథమిక హక్కులను పరిరక్షించే బాధ్యతను రాజ్యాంగం సుప్రీంకోర్టు, హైకోర్టులకు అప్పగించింది. 32వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టు.. 226వ అధికరణ ప్రకారం హైకోర్టు ఐదు రకాల రిట్లు జారీ చేయడం ద్వారా ప్రాథమిక హక్కులను కాపాడుతుంది. ప్రాథమిక హక్కుల సంరక్షణ కోసం సామాన్యమైన పౌరుడు కూడా ఉన్నత న్యాయస్థానాలను సంప్రదించడానికి అవకాశం ఉంది.

**హెబియస్ కార్పస్:** బందీ ప్రత్యక్ష, శరీరాన్ని కలిగి ఉండటం అని పేర్కొనే ఆజ్ఞ. ఒక వ్యక్తి అరెస్టు చట్టబద్ధమా? కాదా? అనేది నిర్ణయించడానికి ఉన్నత న్యాయస్థానాలు ఈ ఆజ్ఞలను జారీ చేస్తాయి. ఈ రిట్ ప్రకారం అరెస్టయిన వ్యక్తిని 24 గంటలలోగా సమీప కోర్టులో హాజరు పర్చాల్సి ఉంటుంది. అరెస్టుకు గల కారణాలు తెలపాలి. అరెస్టయిన వ్యక్తికి తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలి. ఈ రిట్‌ను ప్రభుత్వ అధికారులకు జారీ చేస్తారు. ఒక వ్యక్తి మరో వ్యక్తి(ప్రైవేట్‌వ్యక్తి)పై హెబియస్ కార్పస్ పిటిషన్‌దాఖలు చేయవచ్చు. కానీ కోర్టు మాత్రం ప్రభుత్వాన్ని పార్టీ చేయకుండా డైరెక్ట్‌గా ప్రైవేట్‌వ్యక్తికి ఈ రిట్ జారీ చేయదు. భారత రాష్ట్రపతికి, గవర్నర్లకు, ప్రైవేట్ వ్యక్తులకు, విదేశీయులకు ఈ రిట్‌జారీ చేయరాదు.

**మాండమస్:** ఈ రిట్‌పరమాదేశం లేదా వియ్ కమాండ్ అనే అర్థాన్ని ఇస్తుంది. ఒక ప్రభుత్వ అధికారికి గానీ లేక అధికార సంస్థకు గానీ మీ విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నెరవేర్చండి అని ఆదేశిస్తూ ఉన్నత న్యాయస్థానాలు జారీ చేసే ఆజ్ఞ. ఒక ప్రభుత్వ అధికారి లేక అధికారయుత సంస్థ తమ విద్యుక్త ధర్మాన్ని అంటే తమ విధులను సక్రమంగా నెరవేర్చని సందర్భంలో వ్యక్తులు తమ హక్కులను కోల్పోయినా లేక భంగం కలిగినా ఉన్నత న్యాయస్థానాలను సంప్రదించినప్పుడు న్యాయస్థానాలు ఈ రిట్‌ను జారీ చేస్తాయి. రాష్ట్రపతికి, గవర్నర్లకు, ప్రైవేట్ వ్యక్తులకు, విదేశీయులకు జారీ చేయరాదు.

**ప్రొహిబిషన్:**దిగువ న్యాయస్థానం లేదా ట్రిబ్యునల్‌లో విచారణలో ఉన్న కేసుల విచారణను తక్షణం నిలిపివేయాలని ఆదేశిస్తూ ఉన్నత న్యాయస్థానాలు జారీ చేసే రిట్. ఉన్నత న్యాయస్థానాలు దీన్ని జారీ చేయడానికి గల కారణం, దిగువ న్యాయస్థానాలకు ఆ కేసును విచారించే అధికారం లేకపోవడం లేదా సాంకేతిక కారణమై ఉండవచ్చు.

**సుప్రీంకోర్టు తీర్పులు:**ఎ.కె.గోపాలన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులను సంరక్షించే సందర్భంలోనూ అమలుపరిచే సందర్భంలోనూ సుప్రీంకోర్టు, హైకోర్టులు సమానమైన అధికారాలను కలిగి ఉండటంతో హైకోర్టును సంప్రదించిన తర్వాత మాత్రమే సుప్రీంకోర్టును సంప్రదించాల్సిన అవసరం లేదని, హక్కుల కోసం వ్యక్తులు నేరుగా సుప్రీంకోర్టును సంప్రదించవచ్చని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నది.

రమేశ్ థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులను సంరక్షించే బాధ్యతను రాజ్యాంగం సుప్రీంకోర్టుకు అప్పగించినందున ఏ వ్యక్తి అయిననూ తన హక్కుల సంరక్షణకు లేక అమలుకు న్యాయస్థానాన్ని సంప్రదించినప్పుడు బాధ్యతను తిరస్కరించే అధికారం కోర్టుకు లేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఫెర్టిలైజర్ కార్పొరేషన్ కామ్‌గార్ యూనియన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులను సంరక్షించే బాధ్యతను మన రాజ్యాంగ ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టుకు అప్పగించింది. దీనిని రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగంగా పేర్కొన్నది.

రూప అశోక్ హుర్రా వర్సెస్ అశోక్ హుర్రా మధ్య జరిగిన వ్యాజ్యంలో భారత సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ఉన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున: సమీక్ష చేయడానికి క్యురేటివ్ పిటిషన్ వేసే అధికారం బాధితునికి ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించినప్పుడు, న్యాయాన్ని అందించడంలో న్యాయస్థానం ఏదైనా ముఖ్యమైన అంశాన్ని విస్మరించినట్టుగా తగిన సాక్ష్యాధారాలను కోర్టు ముందు ఉంచినప్పుడు సుప్రీంకోర్టు తిరిగి పునర్విచారణ చేయవచ్చునని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నది.

సెర్సియోరరీ: సాధారణంగా ఈ రిట్‌ను ప్రొహిబిషన్‌తో కలిపి జారీ చేస్తారు. దిగువ కోర్టుల్లోనూ లేక ట్రిబ్యునళ్లలోనూ కేసు విచారణను తక్షణం నిలిపివేసి ఆ కేసును తనకు లేదా మరో కోర్టుకు బదిలీ చేయాలని ఈ రిట్‌ను జారీ చేస్తారు. ఉదాహరణకు దేశంలో సంచలనం సృష్టించిన గుజరాత్‌లోని బెస్ట్ బేకరి కేసును జహీరాషేక్ కోరిక ప్రకారం ముంబయికి బదిలీ చేశారు. కోవారెంటో :ఎట్ వాట్ అథారిటీ లేదా అధికార పృచ్ఛగా పేర్కొనే రిట్ ఇది. ఒక వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా లేక న్యాయబద్ధంగా గానీ ఎలాంటి అధికారాలు లేనప్పటికీ లేని అధికారాలను నిర్వహించే సందర్భంలో ఏ అధికారంతో మీరు ఈ విధులను నిర్వహిస్తున్నారు అని ప్రశ్నిస్తూ ఉన్నత న్యాయస్థానాలు జారీ చేసే రిట్. సదరు అధికారికి చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా ఆ అధికారాలను నిర్వర్తించే అధికారం లేకపోవడమే ఈ రిట్ జారీకి గల ప్రధాన కారణం.

# ప్రారంభం అయిన తెలంగాణ కుంభమేళా సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతర

**వన దేవతలను దర్శించుకున్న రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్ పెన్ పవర్:**తాడ్వాయి మండలం లోని మేడారం లో ఈ రోజు మొదలైన ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర శ్రీ సమ్మక్క సారలమ్మ మినీ మేడారం వన దేవతలను దర్శించుకున్న రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ సందర్భంగా వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించిన సీతక్క గారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ



ఈ రోజు నుండి నాలుగు రోజుల పాటు జరిగే మినీ మేడారం జాతరకు 10 నుండి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే జాతర పరిసరాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మేడారంలో నిరంతర నాణ్యమైన వైద్య సేవలు వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ, అని వైద్య శాఖ సిబ్బంది అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర సమయాలలో ఇబ్బందులకు గురయ్యే వారిని జిల్లా కేంద్రానికి తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా చోరీ సంఘటన జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జంపన్న వాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసర ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులచే నిరంతరం శుభ్రంచేయించాలని తెలిపారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చిన పక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలలో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని, నిరంతరం పోలీస్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న సందర్భంగా గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిర్లను ఏర్పాట్లు చేశామని, దాదాపు 5 కోట్ల 30 లక్షల రూపాయలతో వివిధ పనులను పూర్తి చేయడం జరిగిందని వివరించారు. జాతరను పురస్కరించుకొని పలుచోట్ల ప్రత్యేకంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, త్రాగునీటి కొరత ఏర్పడకుండా నిరంతరం నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు హనుమకొండ జిల్లా కేంద్రం నుండి నిరంతరం బస్సులను మేడారం నడిపించనున్నారని, జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. వనదేవతలను దర్శించుకుని సురక్షితంగా ఎవరి ఇండ్లకు వారు వెళ్లే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జీ అత్రం సుగుణ , కాంగ్రెస్ పార్టీ ములుగుబ్ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు